

యాదగిరీశుడికి వైభవంగా

నిత్య పూజలు

యాదగిరీశుడి సన్నిధిలో బుధవారం నిత్యపూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొల్పిన అర్చకులు, అభిషేకించి తులసీ దళాలతో సహస్రనామార్చనలు జరిపారు.

5



నేటినుంచి ఫ్యామిలీ డిజిటల్ సర్వే

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఫ్యామిలీ డిజిటల్ కార్డును అందుబాటులోకి తేనుంది. ఈ నేపథ్యంలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో గురువారం నుంచి డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం కానుంది. నల్లగొండ జిల్లాలోని ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక మునిసిపల్ వార్డు, ఒక గ్రామపంచాయతీలో సర్వే నిర్వహిస్తారు. 150 గృహాలకు ఒక సర్వే బృందాన్ని నియమించారు. డిజిటల్ కార్డు ద్వారానే రేషన్, ఆరోగ్యశ్రీ, కల్యాణ లక్ష్మి వంటి పథకాలను ఆయా కుటుంబాలకు వర్తింపజేయనున్నారు.

● నల్లగొండ

5

వృక్షాలు దైవ స్వరూపం

● ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



విప్ అయిలయ్యను సన్మానిస్తున్న ప్రధానార్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు, చిత్రంలో వనజీవి రామయ్య

భువనగిరి అర్బన్, అక్టోబరు 2: వృక్షాలు దైవ స్వరూపమని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. యాదగిరిగుట్ట పరిధిలోని యాదగిరిపల్లిలో లక్ష్మీహయగ్రీవ స్వామివారి ఆలయంలో బుధవారం నక్షత్ర వృక్ష స్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వృక్షాలను పూజించడం సనాతన ధర్మంలో భాగమేనన్నారు. వృక్ష సంపద మానవ మనుగడతో ఎంతో ముడిపడి ఉందన్నారు. ప్రభుత్వ లక్ష్యం కూడా ఈ కార్యక్రమం ద్వారా కొంత నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య, హనుమంతు, ప్రపంచ అవార్డు గ్రహీత డాక్టర్ మార్కండేయులు, యాదగిరిగుట్ట ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు, నార్మూల్ మదర్‌డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, వంశీ ఆర్ట్ అధినేత వంశీరామరాజు పాల్గొనగా ఆలయంలోని వేద పాఠశాల విద్యార్థులకు గమన్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నందకిషోర్ ఉచిత వైద్య సేవలు అందించేందుకు హామీ ఇచ్చారు.

గుజరాత్‌లో 'పీఏసీఎస్' క్షేత్రస్థాయి పర్యటన



మొక్కజొన్నను పరిశీలిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

భువనగిరి రూరల్, అక్టోబరు 2: అధ్యయన యాత్రలో భాగంగా భువనగిరి పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు గుజరాత్ రాష్ట్రంలోని పలు సొసైటీలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. బుధవారం గుజరాత్‌లోని వడోదర జిల్లా అవ్వాకల్ వివిధ కార్యకారి సహకార మండలి లిమిటెడ్ సంఘాన్ని పీఏసీఎస్ చైర్మన్ నోముల పరమేశ్వర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు సందర్శించారు. సభ్యత్వాల నమోదు, రుసుము, వ్యవసాయ రుణాలు, వ్యవసాయేతర రుణాలు, దీర్ఘ, స్వల్పకాలిక రుణాలు, ఎరువులకు సంబంధించి గుజరాత్‌లోని అవ్వాకల్ సహకార మండలి సంఘ కార్యదర్శి దన్‌సూక్ వారికి వివరించారు. రాష్ట్రంలో రైతులకు అందిస్తున్న సబ్సిడీ రుణాలు, వడ్డీరేట్లకు, తెలంగాణలో ఉన్న వడ్డీరేట్లు, సబ్సిడీ తదితర అంశాలపై అక్కడి సొసైటీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ఖరీఫ్, రబీ సీజన్‌లో పండించే పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధ్యయనం చేశారు. కార్యక్రమంలో సీఈవో చారి, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మత్తు వదలరా

యువత మత్తుకు అలవాటవుతూ ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటోంది. ముక్కు పచ్చలారని 10 నుంచి 12 ఏళ్ల చిన్నారుల నుంచి మొదలుకుని 30-35 ఏళ్ల యువకులు మత్తు పదార్థాలకు బానిసలవుతూ తమ బంగారు భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసుకుంటున్నారు. ఇటు ప్రభుత్వాలు, అటు స్వచ్ఛంద సంస్థలు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా అంతటా ఫలితం లేకుండా పోతోంది. తల్లిదండ్రుల కలలు నిజం చేయాల్సిన యువకులు అర్థాంతరంగా తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

\- భువనగిరి టౌన్

- మత్తుతో చిత్తవుతున్న యువత
- గంజాయికి బానిసై భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేసుకుంటున్న వైనం
- వలస కార్మికుల వద్ద సులువుగా లభిస్తున్న మత్తు పదార్థాలు
- ఇప్పటికే పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్న పోలీస్ శాఖ



మాదక ద్రవ్యాలు, గంజాయి వినియోగంతో తలెత్తే ఆరోగ్య సమస్యలు, చట్టపరమైన ఇబ్బందులతోపాటు సామాజిక హోదాకు కలిగే భంగంపై ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు విరివిగా ప్రచారం చేస్తున్నాయి. అయినా జిల్లాలో ఈ రెండింటి వినియోగం క్రమేపీ పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కొంతకాలం క్రితం వరకు సంచార జాతులు, సమాజానికి దూరంగా ఉండే కొన్నివర్గాలు మాత్రమే వినియోగించే గంజాయికి సుమారు అన్నివర్గాలకు చెందిన ప్రజలతోపాటు ముఖ్యంగా యువత ఆకర్షితులవుతోంది. అదే సమయంలో వివిధ రూపాల్లో లభిస్తున్న మత్తు పదార్థాలను తీసుకోవడం ఫ్యాషన్‌గా మారుతుండటంతో విద్యార్థులు కూడా ఆ విషవలయంలో చిక్కుకుపోతున్నారు. ఇదే అదనుగా విక్రయదారులు రెచ్చిపోతుండటంతో జిల్లాలో గంజాయి తాగని, విక్రయించని పల్లె, పట్టణం లేదంటే అతిశయోక్తి లేదని పేర్కొనవచ్చు. ఈనేపథ్యంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు పోలీసులు, ఎక్సైజ్ శాఖలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఆశించిన ఫలితాలు రావడంలేదనేది వాస్తవం. ఈ మేరకు గత 10నెలలుగా జిల్లాలో పోలీసులు 22కేసులు నమోదు చేయగా, ఎక్సైజ్ శాఖ రెండు నెలలుగా 23 కేసులను నమోదుచేసి గంజాయి, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకొని నిందితులను కటకటాల వెనక్కినెట్టింది.

10 నెలలుగా 22 కేసులు



జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణకు పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నాం. రెండు జాతీయ రహదారులపై నిరంతరం వాహనాలను తనిఖీ చేస్తున్నాం. ముఖ్యంగా విజయవాడ రహదారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ రవాణా అవుతున్న మాదక ద్రవ్యాలను భారీ మొత్తంలో స్వాధీనం చేసుకున్నాం. కొన్ని సందర్భాల్లో రైల్వే పోలీసులతో కలిసి కూడా రైళ్లలో తనిఖీలు చేశాం. 10 నెలలుగా జిల్లాలో 911.46 కిలోల గంజాయి, 11.344 లీటర్ల ఆశిష్ ఆయిల్, 5050 గ్రాముల పాపిస్ట్రా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నాం. 22 కేసుల్లో 62 మంది నిందితులను అరెస్టు చేసి రెండు వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచాం. డ్రగ్స్, గంజాయి విక్రయాలు, నిలువ, రవాణా, సేవించడంపై గమనించిన ప్రజలు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

\- ఎం.రాజేశ్‌చంద్ర, డీసీపీ, యాదాద్రి జోన్.

100కుపైగా హాట్‌స్పాట్‌ల గుర్తింపు



జిల్లాలో గంజాయి నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. తెలంగాణ నార్కోటిక్ బ్యూరో (టీజీ న్యాబ్)సాంకేతిక పరిజ్ఞానంతో మాదక ద్రవ్యాల విక్రయదారులను, సేవిస్తున్నవారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈమేరకు జిల్లాలో గుర్తించిన 100కు పైగా హాట్‌స్పాట్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. రవాణా మార్గాల్లో, క్షేత్ర స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాలు తనిఖీలను ముమ్మరం చేశాయి. విద్యాసంస్థల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

\- ఎస్ సైదులు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, యాదాద్రి జిల్లా.



గంజాయి విక్రయాలను ప్రారంభించిన కార్మికులు

వలస కార్మికులు గంజాయి విక్రయాలను ప్రారంభించినట్లు తెలుస్తోంది. చాక్లెట్లు, హ్యాష్ ఆయిల్ తదితర డ్రగ్స్‌ను కూడా విక్రయిస్తున్నారు. భువనగిరి మీదుగా ఒడిశా రైళ్లు వెళ్తుండటంతో అక్కడినుంచి గంజాయిని తేవడం సులభతరంగా మారింది. జిల్లా నుంచి రెండు జాతీయ రహదారులు వెళ్తుండటంతో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ తదితర రాష్ట్రాల నుంచి రోడ్డుమార్గంలో జిల్లాకు గంజాయిని తరలిస్తున్నారు. జిల్లా యువత, విద్యార్థులు హైదరాబాద్ నగరంలో స్వేచ్ఛగా కొనుగోలు చేస్తూ ఇక్కడికి తెచ్చుకుంటున్నారు. జిల్లాలో ఉన్న పలు రిసార్ట్స్, వ్యవసాయ క్షేత్రాలు, ఫాంహౌస్‌లలో రేవ్‌పార్టీలు ఇతర ఫంక్షన్ల పేరిట నిర్వహిస్తున్న విందులలో గంజాయి, డ్రగ్స్‌ను వినియోగిస్తున్నట్లు ప్రచారంలో ఉంది. అయితే పోలీసులు పలు పర్యాయాలు దాడులు చేసి రేవ్‌పార్టీలను భగ్నంచేసి నిర్వాహకులను, హాజరైన వారిని కోర్టులో హాజరుపరిచిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీసు, ఎక్సైజ్ శాఖలు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నాయి. కానీ ఆ రెండింటి వినియోగంతో తలెత్తే ఇబ్బందులపై అవగాహన ఏర్పడితేనే నియంత్రణ సాధ్యమౌతుందని సామాజిక కార్యకర్తలు అంటున్నారు.

విరివిగా లభిస్తున్న గంజాయి

జిల్లా అంతటా గంజాయి విక్రయాలు విరివిగా సాగుతున్నట్లు ప్రచారం. అలాగే చాక్లెట్లు, హ్యాష్‌ఆయిల్ తదితర రూపాల్లో డ్రగ్స్ కూడా సులువుగానే లభిస్తున్నట్లు తెలుస్తోంది. కొవిడ్-19 అనంతరం భువనగిరి, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి తదితర ప్రాంతాలకు ఉపాధి నిమిత్తం ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, బీహార్ తదితర రాష్ట్రాలనుంచి భారీ సంఖ్యలో వలస కార్మికులు వచ్చారు. జిల్లాలోని భారీ, చిన్నతరహా, కుటీర పరిశ్రమల్లో కార్మికులుగా, భవన నిర్మాణ తాపీ మేస్త్రీలుగా, అన్ని రంగాల్లో కూలీలుగా, హోటళ్లలో వంట మాస్టర్లుగా, చివరికి హెయిర్ కటింగ్ సెలూన్స్ తోపాటు అన్ని రకాల దుకాణాల్లో వలస కార్మికులే పనులు చేస్తున్నారు. దీంతో జిల్లాలోని మెజార్టీ గ్రామాలు, అన్ని పట్టణాల్లో వలస కార్మికులు పెరిగారు. అయితే మెజార్టీ వలస కార్మికులకు జిల్లాకు రాక పూర్వమే గంజాయి పీల్చడం అలవాటుగా ఉండటంతో వారి అవసరంకోసం తెచ్చుకుంటున్న గంజాయి పట్ల స్థానికులు మొదటగా ఆసక్తి చూపి క్రమేపి బానిసలుగా మారుతున్నారు.

గాంధీ మార్గం అనుసరణీయం



కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

కలెక్టర్ హనుమంతు కే.జెండగే


భువనగిరి (కలెక్టరేట్) అక్టోబరు 2: జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గం అనుసరణీయమని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా కలెక్టరేట్ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసావాదంతో ప్రజాస్వామ్యాన్ని తీసుకురావడంలో కీలక భూమిక పోషించిన మహనీయుడు గాంధీజీ అన్నారు. గాంధీ దేశానికే కాదు ప్రపంచానికే మార్గదర్శకుడన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) కే.గంగాధర్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) పి.బెన్‌షాలోమ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహక అధికారి శోభారాణి, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి యాదయ్య, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: మహాత్మాగాంధీ చూపిన శాంతి మార్గం అందరికీ శిరోధార్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి గాంధీపార్కులో మునిసిపాలిటీ నూతనంగా ప్రతిష్ఠించిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని గాంధీ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. శాంతియుత పోరాటాలతో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు గాంధీ అన్నారు. దేశ భక్తి, సామాజిక సేవలకు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ధ్యాన ముద్రలో ఉన్న మహాత్మా గాంధీ నూతన విగ్రహాన్ని మునిసిపాలిటీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛతా-హీసేవలో భాగంగా ఉత్తమ సేవలు అందించిన 10మంది పారిశుధ్య కార్మికులను సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ గంగాధర్, వైస్‌చైర్మన్ మాయ దశరథ, కమిషనర్ పి.రామాంజుల్‌రెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధీ, శాస్త్రీ జయంతి వేడుకలు

మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను భువనగిరిలో ఘనంగా నిర్వహించారు. సబ్‌జైల్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ సబ్‌జైలు ఖైదీలు సత్‌ప్రవర్తన కోసం గాంధీ జీవిత చరిత్ర పుస్తకాలను చదవాలన్నారు. సబ్‌జైలర్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు. అలాగే చీమలకొండూరులోని బిజ్జల లక్ష్మయ్య ఫౌండేషన్ వయోవృద్ధుల ఆశ్రమంలో సదస్సు నిర్వహించి మహాత్మా గాంధీ జీవన విలువలను, వయోవృద్ధుల హక్కులు, సంక్షేమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జి.శంకర్, ఆశ్రమ నిర్వాహకులు బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీకి ఘన నివాళులర్పించారు. మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, వైస్‌చైర్మన్ మాయ దశరథ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజగోపురానికి బంగారు తాపడం పనులు



తాపడం చేయనున్న ఆలయ దివ్య విమాన రాజగోపురం

భువనగిరి అర్బన్, అక్టోబరు 2: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి దివ్యవిమాన రాజగోపురానికి బంగారు తాపడం పనుల కోసం ప్రభుత్వం సన్నాహాలు మొదలుపెట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఇటీవల సమీక్ష చేపట్టి రాజగోపురానికి బంగారు తాపడం పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కాగా, ఏ విధంగా రూపొందించాలో కమిటీ సభ్యుల నిర్ణయం మేరకు అధికారులు ఖరారు చేసినట్లు తెలిసింది. 127 కిలోల బంగారంతో రాజగోపురానికి తాపడం చేసేందుకు నిర్ణయించినప్పటికీ వివిధ కారణాలతో 65 కిలోలకు తగ్గించినట్లు సమాచారం.

భువనగిరిలో తైక్వాండో జిల్లాస్థాయి పోటీలు

భువనగిరి టౌన్, అక్టోబరు 2: తైక్వాండో జిల్లాస్థాయి పోటీలను బుధవారం భువనగిరిలో నిర్వహించారు. పలు విభాగాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి. రోజంతా పోటీలు ఉత్సాహంగా సాగాయి. విజేతలకు తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొండ్రెడ్డి శ్రీకాంత్ సర్టిఫికెట్లు, బెల్ట్‌లు ప్రదానం చేశారు. అసోసియేషన్ కోశాధికారి ఓరుగంటి రవికుమార్, కోచ్‌లు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా పూల పండుగ

వేడుకగా బతుకమ్మ వేడుకలు



భువనగిరిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

యాదగిరికొండపై బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ.. ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలను బుధవారం జిల్లావ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. తీరొక్క రంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను ప్రతీ వీధిలో ప్రతిష్ఠించి సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు ఉత్సాహంగా ఆడారు. అలాగే దాండియా, కోలాటాలు వేశారు. దీంతో జిల్లాలోని బస్తీలన్నీ పూలవనాలను తలపించాయి. జిల్లా అంతటా మహిళల సందడి నెలకొంది. వివిధ రూపాల్లో బతుకమ్మలను అలంకరించారు. జిల్లాకేంద్రంలో జరిగిన వేడుకల్లో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, వైస్‌చైర్మన్ మాయ దశరథతోపాటు కౌన్సిలర్లు, పలువురు ప్రముఖులు వేడుకలలో పాల్గొని బతుకమ్మ ఆడారు. ఎంగిలిపూల బతుకమ్మ కోసం భువనగిరి మునిసిపాలిటీ అన్ని బస్తీల్లో వీధిలైట్లు తదితర ఏర్పాట్లు చేసింది. పోలీసులు ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించారు. పూల కొనుగోళ్లతో రైతు బజార్, పాత బస్టాండ్ తదితర ప్రాంతాలు రోజంతా కిక్కిరిశాయి. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి కొండపైన బుధవారం మహిళలు బతుకమ్మ ఆటలు ఆడారు.

\- భువనగిరి టౌన్, భువనగిరి అర్బన్

గౌరవంగా జీవించే హక్కుకోసం 'బహుజన బతుకమ్మ'

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చేస్తున్న విమలక్క

భువనగిరి టౌన్, అక్టోబరు 2: పెరుగుతున్న హింస, దాడుల నేపథ్యంలో మహిళలు గౌరవంగా జీవించే హక్కు కోసం బహుజన బతుకమ్మ పేరిట మహోద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క అన్నారు. బుధవారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బతుకమ్మ స్ఫూర్తితో మహిళలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ, హింసకు వ్యతిరేకంగా బతుకమ్మను బతికించుకుందామన్నారు. రాష్ట్రంలో ప్రతీ సంవత్సరం మహిళలపై హింస పెరుగుతుండడంతో మహిళలకు రక్షణ కల్పించడానికి కఠినమైన చట్టాలను తీసుకురావాలన్నారు. సద్దుల వరకు నిర్వహిస్తున్న 'బహుజన బతుకమ్మ'లో మహిళలందరూ పాల్గొనాలన్నారు. అనంతరం బహుజన బతుకమ్మ పోస్టర్‌ను విమలక్క ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పోత్నక్ ప్రమోద్‌కుమార్, వెంకటనర్సింగ్ నాయక్, పడిగెల ప్రదీప్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు రాజునాయక్, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురిపంగ శివలింగం, ఇటుకల దేవేందర్, కుతాడి సురేష్, కొత్త నర్సింహ స్వామి, మాటూరి అశోక్, కర్తాల శ్రీనివాస్, అందె సాయి, లయక్ అహ్మద్, కొత్త బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అవంతీపురంలో నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



మిర్యాలగూడ రూరల్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం అవంతీపురం సరస్వతి అమ్మవారి ఆలయంలో గురువారం నుంచి శారద శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. శృంగేరి పీఠం ధర్మాధికారి డాక్టర్ శరత్ బాబు, పద్మావతి దంపతుల ఆధ్వర్యంలో ఈ నెల 12 వరకు నిర్వహించే ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కోరారు. 9న మూలా నక్షత్రం సందర్భంగా అక్షరభ్యాసాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఘనంగా లక్ష పుష్పార్చన



నార్కట్‌పల్లి, అక్టోబరు 2: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం రాత్రి లక్ష పుష్పార్చన వేడుకను ఘనంగా నిర్వహించారు. భక్తుల శివన్నామ స్మరణల మధ్య పల్లకీ సేవతో మహా మంటపానికి చేర్చారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సహార్చక స్వాములు, వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య లక్ష పుష్పార్చన ఉత్సవం ఆహ్లాదంగా కొనసాగింది.

చికెన్ ధరలు

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.148	220	250
సూర్యాపేట	రూ.145	210	240
నల్లగొండ	రూ.132	190	220



నేటినుంచి ఫ్యామిలీ సర్వే

● ప్రతి కుటుంబానికీ హెల్త్ ప్రొఫైల్ డిజిటల్‌కార్డు ● అసెంబ్లీ నియోజకవర్గంలో వార్డు, గ్రామపంచాయతీ ఎంపిక ● 150గృహాలకు ఒక బృందం



నల్లగొండ, అక్టోబరు 2: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఫ్యామిలీ డిజిటల్‌కార్డు అందుబాటులోకి తీసుకురాబోతోంది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో గురువారం నుంచి డిజిటల్ కార్డు సర్వే ప్రారంభం కానుంది. జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక మునిసిపల్ వార్డు, ఒక గ్రామ పంచాయతీలో సర్వే చేస్తారు. 150 గృహాలకు ఒక సర్వే బృందాన్ని నియమించారు. డిజిటల్‌కార్డుతోనే రేషన్, ఆరోగ్యశ్రీ, కల్యాణలక్ష్మి వంటి పథకాలను ఆయా కుటుంబాలకు వర్తింపజేస్తారు. డిజిటల్‌కార్డుతో అందరి హెల్త్‌ప్రొఫైల్ డిజిటల్‌కార్డును అందించాలని యోచిస్తున్నారు. పైలట్ ప్రాజెక్టు పద్ధతిన జిల్లాలో ఎంపిక చేసిన వార్డులు గ్రామాల్లో సర్వే చేపట్టనున్నారు. ఈ నెల 7వ తేదీలోగా సర్వే పూర్తి కానుంది. ఎంపిక చేసిన గ్రామాలు, వార్డుల్లో ప్రజలు డిజిటల్ కార్డు వివరాలను అందించేందుకు ఆధార్‌కార్డు ఉంటే తీసుకరావాలని, లేకుంటే ప్రత్యామ్నాయంగా ఇతర కార్డులను తీసుకరావాలని అధికారులు సూచిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆధార్‌కార్డు ఉన్నట్లే కుటుంబానికి ఒక కార్డు ఉండాలన్నా ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ కుటుంబ డిజిటల్ కార్డును ఇచ్చేందుకు నిర్ణయించింది.

సర్వే బృందాలకు శిక్షణ పూర్తి

డిజిటల్ కార్డు సర్వే బృందాలకు అధికారులు శిక్షణ కూడా ఇచ్చారు. ప్రస్తుతం ఆధార్‌కార్డు ఎన్నో పథకాలకు తప్పనిసరి అయిన విషయం తెలిసిందే. అది ఒక వ్యక్తికి మాత్రమే ఉపయోగపడుతున్నందున కుటుంబానికి మొత్తానికి ఒక కార్డు ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పైలట్ పద్ధతిన జిల్లాలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుంది. కుటుంబ డిజిటల్‌కార్డు అమలు చేస్తున్న రాష్ట్రాల్లో రాష్ట్రస్థాయి అధికారులు అధ్యయనం చేసిన తర్వాతే ప్రభుత్వం ఈ డిజిటల్ కార్డును అమలు చేయాలని ప్రణాళిక బద్ధంగా ముందుకు తీసుకొచ్చింది. కుటుంబ డిజిటల్‌కార్డు సర్వేలో భాగంగా ముందుగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక చిన్న మునిసిపల్ వార్డు, అదేవిధంగా ఒక చిన్న గ్రామాన్ని ఎంపిక చేశారు. గురువారం నుంచి సర్వే ప్రారంభం కానుంది. ఉదయం 9గంటలకు సర్వేను ప్రారంభిస్తారు. ఐద రోజుల్లో ఈ సర్వే పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు పట్టణ ప్రాంతాలల్లో మునిసిపల్ కమిషనర్లు ఈ సర్వేను చేపడుతారు. మండలస్థాయిలో మండలాధికారులతో పాటు ఒక ఫొటోగ్రాఫర్‌తో పాటు మొత్తం నలుగురు ఉండనున్నారు. ధనిక, పేద అనే తేడా లేకుండా ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వనున్నారు. సర్వే బృందాలకు ముందుగానే ఎంపిక చేసిన గ్రామాలు, మునిసిపల్ వార్డుకు సంబంధించిన బేస్ డేటాను అందించారు. ఆ డేటా ప్రకారం సర్వే సాగనుంది. ఎంపిక చేసిన గ్రామాల్లో ముందుగానే ప్రజలకు తెలియజేయనున్నారు. ఆయా ప్రాంతాలల్లో టాంటాం వేయించి సర్వే గురించి తెలియజేయనున్నారు. ఒక వ్యక్తిరెండు కుటుంబాల్లో సభ్యులు ఉండకుండా చూడనున్నారు. ఆధార్ నెంబర్ ఇచ్చినట్లుగానే ఆయా కుటుంబాలకు డిజిటల్‌కార్డుకు ఒక నెంబర్ ఇస్తారు. అలాగే ప్రతి ఒక కుటుంబంలో ప్రతి ఒక వ్యక్తికి ఒక ఐడీ నెంబర్‌తో కార్డు ఇవ్వనున్నారు.

అచ్చంపేటపట్టి గ్రామం ఎంపిక

చందంపేట: ప్రభుత్వం నూతనంగా అందించనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టుకు నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని అచ్చంపేటపట్టి గ్రామం ఎంపికైందని తహసీల్దార్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు ఈ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామస్థులు సహకరించి అందుబాటులో ఉండాలని ఆయన కోరారు.

కుటుంబ వివరాల సేకరణ కోసం..

డిజిటల్ కార్డు ఇవ్వడం కోసం చేపడుతున్న ఈ సర్వేతో కుటుంబ వివరాలను సేకరించనున్నారు. కొంతమంది ప్రజలు అపోహలతో వివరాలు ఇచ్చేందుకు వెనకడుగు వేసే అవకాశం ఉండడంతో ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. కుటుంబ డిజిటల్ కార్డుపై ప్రజలు అనవసరమైన అపోహలకు, ఆందోళనలకు గురికాకుండా ఉండేలా అధికారులు వారికి సూచనలు చేయనున్నారు. సాధ్యమైనంత మేరకు కుటుంబ సభ్యుల వివరాలు, ఫోటోలు సేకరించాలని నిర్ణయించారు. డిజిటల్ కార్డు సర్వేకు వెళ్లే బృందాలు ప్రజలను ఇబ్బందులు పెట్టకుండా చూడాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చారు. సర్వే బృందాలు కుటుంబ వివరాలతో పాటు సాధ్యమైనంత వరకు కుటుంబ సభ్యులంతా ఒకే ఫోటోలో వచ్చేలా ఫోటోను తీసుకోవాలని నిర్ణయించారు. ఫోటో తీసే సమయంలో ఎవరైనా కుటుంబ సభ్యులు అందుబాటులో లేనట్లయితే 5రోజులలో తిరిగి ఆ ఇంటికి వెళ్లి ఫోటోను సేకరించనున్నారు. ఇదిలా ఉంటే నియోజకవర్గానికి ఒక అధికారిని కూడా నియమించారు. జిల్లాలోని నకిరేకల్, నల్లగొండ, మునుగోడు, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాలకు సంబంధించి ఆర్డీవోలకు బాధ్యతలు అప్పగించారు. ఆర్డీవోల సమక్షంలో ఈ సర్వే కొనసాగనుంది.

'పులిచింతల' ప్రాజెక్టుపై మొసలి కలకలం



వంతెనపై నుంచి వెళ్తున్న మొసలి

మేళ్లచెర్వు, అక్టోబరు 2: ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు జలవిద్యుత్ కేంద్రం సమీపంలో మొసలి సంచరించటంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. బుధవారం తెల్లవారుజామున తెలంగాణ నుంచి పులిచింతల బ్రిడ్జి మీదుగా ఆంధ్రా ప్రాంతం వైపు వెళుతున్న పలువురు వాహనచోదకులు ప్రాజెక్టు జలవిద్యుత్ కేంద్రం సమీపంలో ఉన్న భారీ మొసలిని గుర్తించి వీడి యోలు సామాజిక మాధ్యమంలో పోస్టు చేయడంతో స్థానికంగా వైరల్ అయ్యింది. స్థానికుల అలికిడికి కొద్దిసేపటి అనంతరం మొసలి ప్రాజెక్టు నీటిలోకి జారుకుంది. కృష్ణానదిలోకి ఇటీవల భారీగా వరదలు రావడంతో ప్రాజెక్టులోకి భారీ సంఖ్యలో మొసళ్లు చేరినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. మొసళ్లు గుడ్లు పెట్టే సమయం కావడంతో పులిచింతల ప్రాజెక్టు పరిసర గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

యాదగిరీశుడికి ఘనంగా నిత్య పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, అక్టోబరు 2: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిఅమ్మవార్లను మేల్కొల్పిన అర్చకులు గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువులను స్వవర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీ దళాలతో సహస్రనామార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో వేద మంత్రాలు, మంగళవాద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్ర హవనం శైవాగమన పద్ధతిలో చేపట్టారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 10,78,464ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. శివాలయంలోని ప్రాకార మండపంలో దుర్గాదేవి నవరాత్రోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. నేటినుంచి తొమ్మిది రోజుల పాటు జరిగే శరన్నవరాత్రోత్సవాలు నిర్వహణకు చలువ పందిళ్లు, మామిడి తోరణాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. వేడుకల్లో పాల్గొనే దంపతులు రూ.1,116, అదేవిధంగా ఒక రోజు సప్తశతి పారాయణం రూ. 116, లక్ష కుంకుమార్చన రూ.116 టికెట్‌తో పాల్గొనాలని కోరారు.

మూడో ఘాట్ రోడ్డు ధ్వంసం



ఇనుప పట్టీలు తేలిన ఘాట్ రోడ్డు

యాదగిరికొండ పైకి వెళ్లేందుకు మూడో ఘాట్ వెంట జాయింట్ వద్ద రోడ్డు ధ్వంసమైంది. మరమ్మతులు చేసినప్పటికీ మళ్లీ ధ్వంసం కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలతలెత్తుతున్నాయి. ఘాట్‌లో రోడ్డు ధ్వంసమైన చోట ఇనుప పట్టీలు తేలాయి. అదేవిధంగా వేగం తగ్గడంతో పైకి ఎక్కేందుకు ఆటంకం ఏర్పడుతోంది. త్వరగా మరమ్మతులు చేసి ఇబ్బందులు తొలగించాలని భక్తులు కోరుతున్నారు.



వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

హుజూర్‌నగర్, అక్టోబరు 2: ఉమ్మడి జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. బైక్‌ను టిప్పర్ ఢీ కొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని మల్లన్ననగర్‌కు సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. ఏపీలోని జగ్గయ్యపేట మండలం వేదాద్రి గ్రామానికి చెందిన పెసరమల్లి నరేష్‌బాబు(32) కోదాడ పట్టణంలోని మహాసిమెంట్ లారీ ట్రాన్స్‌పోర్ట్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. పని ముగించుకుని హుజూర్‌నగర్‌లో ఇంటికి వస్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీ కొని తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తమ్ముడు ఆదినారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ ముత్తయ్య తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గేదెలకు పచ్చిమేత తీసుకొని వస్తూ



వెంకన్న(ఫైల్)

గరిడేపల్లి: గేదెలకు పచ్చిమేత తీసుకొని వస్తూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి ఇనుపచువ్వ గొంతులో గుచ్చుకొని వ్యక్తి చెందాడు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కల్మలచెర్వులో బుధవారం ఈ ఘటన జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అవిరబోయిన వెంకన్న(40) గేదెలకు పచ్చిమేత కోసం గ్రామానికి శివారులో గల తన పొలం వద్దకు ట్రాక్టర్‌పై వెళ్లాడు. పచ్చిమేత కోసుకొని తిరిగి ఇంటికి బయలు దేరాడు. తన పొలం నుంచి రోడ్డు మీదికి వచ్చే ప్రదేశంలో సుమారు 10అడుగుల ఎత్తుగల ర్యాంపు ఉంది. ఆ ర్యాంపు నుంచి ట్రాక్టర్‌ను ఎక్కిస్తున్న క్రమంలో మధ్యలోకి రాగానే ట్రాక్టర్ ఆగిపోయింది. ట్రాక్టర్‌ను అదుపు చేయడంలో వెంకన్న తడబడడంతో ట్రాక్టర్ పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ టేప్ రిక్డార్ పెట్టె ఇనుప చువ్వ గొంతులోకి గుచ్చుకొని వెంకన్న అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గరిడేపల్లి మండలం ఎల్బీనగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. గానుగుబండకు గ్రామానికి చెందిన మేఘన, నేరేడుచర్ల పట్టణానికి చెందిన సాయిశ్రీ స్కూటీపై నేరేడుచర్లకు వెళ్తూ ఎల్బీనగర్ వద్ద లారీని క్రాస్ చేసే సమయంలో స్కూటీ లారీకి తగలడంతో ఇద్దరికి గాయాలయ్యాయి వారిని ప్రైవేట్ వాహనంలో ఖమ్మంలోని ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

ఆస్పత్రిలో చికిత్సపొందుతూ..



చంద్రమౌళి(ఫైల్)

రాజాపేట: యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం సోమారం గ్రామానికి చెందిన చిందు కళాకారుడు పిల్లుట్ల చంద్రమౌళి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆయన సెప్టెంబరు 20న జనగామ జిల్లా దేవరుప్పల వద్ద బైక్ అదుపు తప్పి గాయాలపాలయ్యాడు. ఆయనను గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అపహరణకు గురైన ట్రాక్టర్ స్వాధీనం

● ఇద్దరు నిందితులకు రిమాండ్

ఆత్మకూర్(ఎస్), అక్టోబరు 2: చోరీ చేసిన ట్రాక్టర్‌ను విక్రయించడానికి వెళ్లి సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో దానిని ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో తిరిగి ట్రాక్టర్‌ను తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే అతడి వెనుక నుంచి బైక్‌పై వస్తున్న వ్యక్తి కూడా అనుమానాస్పదంగా కనిపించగా ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణానికి చెందిన సంపంగి దుర్గాప్రసాద్ గతంలో బండరాయి కొట్టేందుకు ఆత్మకూర్(ఎస్) మండలం గుడితండాకు వచ్చాడు. అయితే అతడి సమీప బంధువు పసుపుల రవితో కలిసి అదేతండాకు చెందిన ధరావత్ రవి చెందిన ట్రాక్టర్‌ను ఎత్తుకెళ్లారు. దాంతో రవి సెప్టెంబరు 25న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిఘా పెట్టి దుర్గాప్రసాద్ నకిరేకల్‌లోని తన ఇంటి వద్ద నుంచి మహబూబాబాద్‌లో విక్రయించడానికి వెళ్లి సరైన ధృవపత్రాలు లేకపోవడంతో ఎవరూ కొనుగోలు చేయక పోవడంతో తిరిగి వస్తుండగా పాతర్లపహాడ్ స్టేజీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. నిందితుల నుంచి ట్రాక్టర్, బైక్, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దుర్గాప్రసాద్‌పై గతంలో కేతేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్ దొంగతనం నమోదైనట్లు వివరించారు.

పోలీసుల అదుపులో బైక్ చోరీ నిందితుడు ?

నల్లగొండ క్రైం, అక్టోబరు 2: జిల్లాకేంద్రంలో బైక్ చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నల్లగొండ మున్సిపాలిటీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేస్తున్న కేశరాజుపల్లి(కొత్తగూడెం)కు చెందిన మురిశెట్టి నగేష్ గత నెల సెప్టెంబరు 30న తన బైక్‌ను రాంనగర్ పార్క్ ఎదుట పార్క్ చేశాడు. రోజూ మాదిరిగానే హరితహారం వాహనం తీసుకుని తన తోటి వర్కర్లను తీసుకుని డ్యూటీకి వెళ్లి వచ్చే సరికి బైక్ చోరీకి గురైంది. బాధితుడు జిల్లాకేంద్రంలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాల ద్వారా ఒక్క రోజులోనే నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమచారం. అదేవిధంగా జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల్లో మూగ జీవాలను ఎత్తు కెళ్లి వాటి మాంసం విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రంతో పాటు గ్రామ శివారు కొట్టాల్లో ఉన్న మేకలు, గొర్రెలకు గుంపులను టార్గెట్ చేసి ముఠా ఎత్తుకెళ్లే వారు అని తెలిసింది. రెండు రోజుల క్రితం ఈ ముఠాను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఏపీకి చెందిన ముఠాగా భావిస్తున్నారు.

మద్యం మత్తులో గడ్డిమందు తాగి..

నిడమనూరు, అక్టోబరు 2: మద్యం మత్తులో గత నెల 30న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన కట్టెబోయిన శివ(30) రెండు నెలల క్రితం కుటుంబంతో వచ్చి నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వేంపాడ్ శివారులో పామాయిల్ తోటలో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆర్థిక పరిస్థితులు బాగోలేకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. భార్యాభర్తల నడుమ గొడవలు జరగడంతో కొద్ది రోజుల క్రితం భార్య ధనమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది. దాంతో మనస్తాపానికి గురై మద్యం మత్తులో గత నెల 30న అర్ధరాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి వెంటనే చికిత్స కోసం మిర్యాలగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా వైద్యుల సలహా మేరకు నల్లగొండలోని మరో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గోపాల్‌రావు తెలిపారు.

150 కిలోల నల్లబెల్లం స్వాధీనం

నూతన్‌కల్, అక్టోబరు 2: సూర్యాపేట జిల్లా నూతన్‌కల్, హుజూర్‌నగర్ మండలాల్లో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటికను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేట నుంచి తుంగతుర్తి వైపు వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను నూతన్‌కల్‌లో తనిఖీ చేయగా 50 కిలోల నల్లబెల్లం, 4 క్వింటాల పటికను పట్టుకున్నట్లు ఎస్‌ఐ మహేంద్రనాథ్ తెలిపారు. తుంగతుర్తి మండలం దొనబండ తండాకు చెందిన లాకావత్ హరిసింగ్, అతడి మామ మహబూబాబాద్ జిల్లా చినగూడూరుకు చెందిన భూక్యా మల్సూర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఎక్సైజ్ అధికారులు బుధవారం వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి 100 కిలోల బెల్లం, మూడు లీటర్ల సారా, రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలానికి చెందిన షేక్ అబ్దుల్లా బైక్‌పై 50 కిలోల బెల్లం, గరిడేపల్లి మండలం కాల్వపల్లికి చెందిన దుగ్గి శ్రీనివాస్ మోటార్ సైకిల్‌పై 50 కిలోల బెల్లం, మూడు లీటర్ల సారా తరలిస్తుండగా కాల్వపల్లి వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ వెన్నెల, సిబ్బంది నాగయ్య, బాలు, నాగరాజు, రవి పాల్గొన్నారు.

జీ-స్పార్క్ సదస్సుకు స్వామినాయక్



స్వామినాయక్

తిరుమలగిరి(సాగర్), అక్టోబర్ 2: భవిష్యత్తులో వచ్చే సంక్రమిత వ్యాధులు, వాటి నివారణ, వాటిని ఎదుర్కొవడానికి చర్యలు గురించి గురువారం నుంచి ఈ నెల 5 వరకు నిర్వహించనున్న జీ-స్పార్క్ సదస్సుకు నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలంలోని నాగార్జునపేటతండాకు చెందిన ఆంగోతు స్వామినాయక్ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి వైద్య రంగంలో నిపుణులు హాజరుకానున్నారు. సదస్సులో 'ఇన్‌ఫెక్షన్స్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్, యాంటి మైక్రోబయల్ రెసిస్టెన్స్' అంశాలపై నిపుణులు చర్చించనున్నట్లు స్వామినాయక్ తెలిపారు. ఇన్‌ఫెక్షన్స్ కంట్రోల్ అకాడమి ఆఫ్ ఇండియా, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ప్రజ్ఞాన్ సస్టైనబుల్ హెల్త్ ఔట్ కమ్స్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామినాయక్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు చెందిన స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు. గతంలో ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, అసంక్రమిత వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిస్, హృదయ సంబంధ వ్యాధుల నివారణ, కుష్టు, 104, కొవిడ్ కాల్ సెంటర్‌కు సలహాదారుడిగా, ప్రోగ్రాం ఆఫీసర్‌గా విధులు నిర్వర్తించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వంలో కేంద్ర ప్రభుత్వ కాయకల్ప ప్రోగ్రాంకు అసెస్సర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రుల బలోపేతం చేయడంపై వైద్యారోగ్యశాఖకు సలహాలు ఇస్తూ ఉద్యోగ బాధ్యత నిర్వరిస్తున్నాడు. ఆయన గతంలో ఇమ్యూనైజేషన్, గిరిజన ప్రాంతాల్లో క్షయవ్యాధి కారకాలు, కుష్టురోగం, గర్భిణుల్లో పోషకాహార లోపాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశకార్యకర్తల ప్రాముఖ్యతపై పలు పరిశోధనలు చేశారు. అంతర్జాతీయ స్థాయి సదస్సుకు స్వామినాయక్ ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



జశ్వంత్‌కుమార్

కట్టంగూరు, అక్టోబరు 2: నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం చెర్వుఅన్నారం ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థి ఇరుగు జశ్వంత్‌కుమార్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 1న యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చి అండర్-17 విభాగంలో ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నారాయణపేట జిల్లా కోస్గిలో నిర్వహించే 68వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని పాఠశాల హెచ్‌ఎం కందాల రమ, ఫిజికల్ డైరెక్టర్ చింతకాయల పుల్లయ్య తెలిపారు.

నీటి కుంటలో పడి వృద్ధురాలు మృతి

రామన్నపేట, అక్టోబరు 2: నీటి కుంటలో పడి వృద్ధురాలు మృతిచెందింది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని తుమ్మలగూడెంలో జరిగింది. ఎస్‌ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నిధానపల్లి గ్రామానికి చెందిన గోపగోని భారతమ్మ(70) తుమ్మలగూడెం గ్రామ శివారులోని కుమ్మరికుంటలో బుధవారం మృతి చెందినట్లు తుమ్మలగూడెం గ్రామానికి చెందిన మండడి గోపాల్‌రెడ్డి సమాచారం ఇచ్చారు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని కుంటలో నుంచి బయటకు తీసి రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలి కుమార్తె బత్తిని కలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిడుగుపాటుకు రెండు ఆవులు..

కట్టంగూరు, అక్టోబరు 2: నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని చెర్వుఅన్నారం గ్రామంలో బుధవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై రెండు ఆవులు మృత్యువాత పడ్డాయి. గ్రామంలో సూరారపు గిరి అనే రైతుకు చెందిన రెండు ఆవులు వ్యవసాయ బావి వద్ద మేత మేస్తుండగా సాయంత్రం ఉరుములు, మెరుపులతో పిడుగు ఆవుల మేస్తున్న పక్క ప్రదేశంలో పడటంతో అక్కడికక్కడే మృతిచెందాయి. ఒక్కొక్క ఆవు ఖరీదు సుమారు రూ.60వేల నుంచి రూ.70వేల వరకు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

30క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నూతనకల్, అక్టోబరు 2: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ మహేంద్రనాథ్ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం బికుమల్ల గ్రామ శివారులో 365 జాతీయ రహదారిపై వాహ నాలు తనిఖీ చేస్తుండగా మహబూబాబాద్ జిల్లా మరిపెడ నుంచి నూతనకల్ వైపు వస్తున్న బొలెరో 30 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు చెప్పారు. బుద్ధ శ్రీనివాస్, డ్రైవర్ బాదావత్ సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి తీవ్రగాయాలు

రాజాపేట, అక్టోబరు 2: వీధి కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం కొండేటి చెరువులో శనివారం జరిగింది. గ్రామానికి గాజ రవి కుమారుడు పవన్(7) సాయంత్రం నానమ్మ ఇంటికి వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో రెండు, మూడు వీధి కుక్కలు దాడి చేయడంతో బాలుడికి గాయాలయ్యాయి. దాంతో భయంతో పరుగెత్తడంతో కిందపడిడడంతో తలకు గాయమైంది. చికిత్స నిమిత్తం సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ఆదరించాలి

ప్రముఖ సినీ హాస్యనటుడు బ్రహ్మానందం



హాస్యనటుడు బ్రహ్మానందంను చేనేత శాలువాతో సన్మానించిన పోచంపల్లి చేనేత నాయకులు

భూదాన్‌పోచంపల్లి, అక్టోబరు 2: ప్రతిఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి కార్మికులకు ఉపాధి కల్పించాలని ప్రముఖ సినీ హాస్యనటుడు బ్రహ్మానందం అన్నా రు. బుధవారం సాయంత్రం భూదాన్‌పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని ఆవాస గ్రామమైన ముక్తాపూర్ పరిసరాల్లో జరిగిన ఓ సినిమా షూటింగ్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా భూదాన్‌పోచంపల్లికి చెందిన చేనేత నాయకులు చింతకింది కిరణ్, మంగళపల్లి శ్రీహరి బ్రహ్మానందంను కలిసి చేనేత శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి చేనేత కళాకారులకు నిలయమని, ఇక్కడి చేనేత వస్త్రాలకు దేశ విదేశా ల్లో మంచి డిమాండ్ ఉందన్నారు. చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించాలని, అందుకోసం చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ప్రభాకర్, కొండ శివకుమార్, వేముల సుమన్‌గౌడ్ పాల్గొన్నారు.

కాల్వల్లో చెత్త..రోడ్డుపై మురుగు

- పాత దుస్తులు, ఖాళీ సీసాలు
- ప్లాస్టిక్ వ్యర్థాలన్నీ మోరీల్లోనే..
- చెత్త నిర్వహణపై చైతన్యపరుస్తున్న మునిసిపల్ సిబ్బంది

భువనగిరి టౌన్, అక్టోబరు 2: ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత దుస్తులను తరచూ మురికి కాల్వల్లో పడేయడంతో వరద సాఫీగా వెళ్లకుండా రోడ్లపైకి వస్తోంది. పరిసరాల పరిశుభ్రతతో ప్రజారోగ్యం లక్ష్యంగా సుమారుగా 13 సంవత్సరాల క్రితం ప్రభుత్వం మునిసిపాలిటీల్లో ఇంటింటా చెత్త సేకరణను ప్రారంభించింది. ప్రతిరోజూ లేదా రోజు విడిచి రోజు మునిసిపల్ వాహనం, పారిశుధ్య కార్మికులు బస్తీల్లో తిరుగుతూ ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఈ మేరకు భువనగిరి మునిసిపాలిటీలోని 35 వార్డుల్లో 20కి పైగా వాహనాలు తిరుగుతూ ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను సేకరిస్తున్నారు. రోజువారీగా సుమారు 30 మెట్రిక్‌టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇందుకు ప్రజలు చేయాల్సిందల్లా ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను తడి, పొడి చెత్తగా వేరుపరిచి సిబ్బందికి అందించాలి. ఇందుకోసం చెత్తను నిలువ చేయడానికి పలు దఫాలుగా బుట్టలను కూడా అందజేశారు. చెత్త సేకరణ సిబ్బంది సక్రమంగా రాకుంటే ఫిర్యాదు లేదా సమాచారం ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.



మోరీ నుంచి తీసిన ప్లాస్టిక్ వ్యర్థాలు, సానిటరీ ప్యాడ్స్

కారణం ఏమిటి? బాధ్యులు ఎవరు?

పలువురు పట్టణవాసులు ఖాళీ మద్యం, వాటర్, కూల్‌డ్రింక్స్ బాటిల్స్ సహా పాత దుస్తులు, ప్లాస్టిక్ వ్యర్థాలు చివరికి శానిటరీ న్యాప్‌కిన్స్ సహా ఇళ్లలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు అన్నింటిని సమీపంలోని మురికి కాలువల్లో పారవేస్తున్నారు. ఫలితంగా మోరీలు నిండిపోయి, రహదారులపై మురికి నీరు ప్రవహించడం పలు బస్తీల్లో నిత్యకృత్యం అవుతోంది. ఇలాంటి పరిస్థితిలో వెంటనే ప్రజలు మునిసిపాలిటీపై ఆగ్రహం వ్యక్తం చేస్తుండటం, అందుబాటులో ఉన్న కౌన్సిలర్లు, మునిసిపల్ సిబ్బందిని నిలదీయడం పరిపాటిగా మారుతోంది. కానీ తాము చేస్తున్న తప్పిదాల కారణంగానే మురికి కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయని, గ్రహించడంలేదని మునిసిపల్ పారిశుధ్య సిబ్బంది వాపోతున్నారు. తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా వ్యర్థాలతో కూరుకపోయి దుర్గంధం వెదజల్లుతున్నా మురికి కాల్వలను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుల శ్రమను చూసైనా ప్రజలు తమ వైఖరిని మార్చుకోవాలని పలువురు అంటున్నారు. పైగా వరుసగా కురుస్తున్న వర్షాలతో మురికి కాలువల సమస్యలు పెరుగుతూ పరిసరాల పరిశుభ్రతపై ప్రభావం చూపుతూ అంతిమంగా ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉన్నందున ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను బాధ్యతాయుతంగా మునిసిపల్ సిబ్బందికి అందించాలని, మురికి నీటి ప్రవాహం కోసమే మురికి కాల్వలు ఉన్నాయనే నిజాన్ని గ్రహించాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.



మోరీని శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మహాత్ముడి మార్గం అనుసరణీయం

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింస మార్గాలు ప్రతీ ఒక్కరికీ అనుసరణీయమని పలువురు అన్నారు. బుధవారం గాంధీ జయంతిని జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. భువనగిరి మండలంలోని తాజ్‌పూర్‌లో గాంధీ విగ్రహానికి సామాజిక వేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంబీసీ జిల్లా అధ్యక్షులు కొత్త బాలరాజు, ఉద్యోగ సంఘాల ప్రతినిధి మాటూరి అశోక్, మెరుగు మధు, పక్కీరు కొండల్‌రెడ్డి, గోమారి ఎల్లారెడ్డి, ఏనుగు ధర్మారెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

- వలిగొండలో మండల ప్రత్యేక అధికారి జగన్నాధరావు, ఎంపీడీవో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, తాజామాజి ఎంపీపీ నూతి రమేష్‌రాజు, నాయకులు పాశం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య పాల్గొన్నారు.
- ఆత్మకూరు(ఎం)లో తహసీల్దార్ వి.రవికుమార్, ఎంపీడీవో రాములునాయక్, నాయకులు వై.లక్ష్మారెడ్డి, జి.కాశీనాథ్, బి.ఇంద్రారెడ్డి, మాజీ జడ్పీటీసీ కె. నరేందర్, మాజీ సర్పంచ్ జె.నగేష్, ఎం.సిద్ధయ్య ఉన్నారు.
- మోత్కూరులో మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత, వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, కమిషనర్ సి.శ్రీకాంత్ వివిధ పార్టీల, సంస్థల ప్రతినిధులు గడ్డం నర్సింహ, అవిశెట్టి అవిలిమల్లు, గుండగోని రామచంద్రు పాల్గొన్నారు. మోత్కూరు గ్రంథాలయంలో మహాత్మాగాంధీ, దివంగత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి గ్రంథపాలకుడు సిహెచ్.బాబుచారి, గ్రంథాలయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోమటి మత్స్యగిరి, సజ్జనం మనోహర్, దండ్ల కళ్యాణ్, చేపూరి బిక్షం పాల్గొన్నారు.
- చౌటుప్పల్ పట్టణంలో మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కమిషనర్ కె.నర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, టీడీపీ మునుగోడు అసెంబ్లీ ఇన్‌చార్జి బడుగు లక్ష్మయ్య, పట్టణ అధ్యక్షుడు సుంకరి జంగయ్యగౌడ్, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు ఆకుల ఇంద్రసేనారెడ్డి, పట్టణ అధ్యక్షుడు సుర్వి నర్సింహ్మగౌడ్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మంచికంటి భాస్కర్‌గుప్త, కామిశెట్టి చంద్రశేఖర్, పర్నె శివారెడ్డి పాల్గొన్నారు.
- ఆలేరు మండలంలో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రీల జన్మదిన వేడుకలను ఆలేరు, కొలనుపాక, టంగుటూరు తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. నాయకులు దూడల రమేష్, వీరేశం, వెంకటేశ్వర్‌రాజు, కిష్టయ్య, కుమార్ ఉన్నారు.
- రామన్నపేటలో తహసీల్దార్ లాల్ బహదూర్, ఎంపీడీవో భూక్యా నాయక్, నాయకులు సాల్వేరు అశోక్, వేమవరం సుధీర్‌బాబు, బందెల రాములు, జాడ సంతోష్, శివకోటి, యాదగిరి పాల్గొన్నారు.
- మోటకొండూరులో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధానకార్య దర్శి సిరిబోయిన మల్లేష్, మండల వర్కింగ్ ప్రేసిడెంట్ వంగపల్లి మహేందర్, జిల్లా జాయింట్ సెక్రెటరి భాస్కరుని రఘునాథరాజ్ పాల్గొన్నారు.
- బొమ్మలరామారంలో పీఏసీఎస్ చైర్మన్ గూదె బాల నర్సింహ, మాజీ ఉపసర్పంచ్ జూపల్లి భరత్, కుక్కదువు గణేష్, కృష్ణ పాల్గొన్నారు.
- గుండాలలో ఇమ్మడి దశరథ, షర్ఫొద్దీన్, దేవనబోయిన అయిలయ్య, బజ్జూరి నాగరాజు, చందు, శ్రీనివాస్, కొత్త రమేష్, సతీష్, సిరాజొద్దీన్, పొడిశెట్టి వెంకన్న, కొడపర్తి భాస్కర్, బాలలింగం పాల్గొన్నారు.
- రాజాపేట మండల కేంద్రంలో, పుట్టగూడెం, పారుపల్లి, నెమిల, గ్రామాల్లో గాంధీ జయంతిని నిర్వహించారు.
- సంస్థాన్ నారాయణపురంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మందుగుల బాలకృష్ణ, నాయకులు కొన్‌రెడ్డి నరసింహ, కరంటోత్ రమేష్, చిలుకూరి శ్రీనివాసులు, ఉప్పల నాగరాజు, చిలువేరు శంకర్, రాజు పాల్గొన్నారు.
- భూదాన్‌పోచంపల్లిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు మెరుగు శశికళ, పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామియాదవ్, కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్‌నాయక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



భువనగిరి మండలం తాజ్‌పూర్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాస్



వలిగొండలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



పోచంపల్లిలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

క్రీడలతో మానసిక ఉల్లాసం: ఎమ్మెల్యే



వంగపల్లిలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 2: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం మండలంలోని వంగపల్లి గ్రామంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని స్థానిక పోలీసులు, ప్రింట్, ఎలక్ట్రాన్‌మీడియా ప్రతినిధులు , పురోహితులు కలిసి ఒక్కరోజు నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆయన బ్యాటింగ్ చేస్తూ ప్రారంభించారు. కార్యక్రమంలో మదర్‌డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అన్నం సంజీవరెడ్డి, డీసీపీ రమేష్‌కుమార్, సీఐలు రమేష్, కొండల్‌రావు, కృష్ణ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజ్‌గౌడ్, మదర్‌డైరీ డైరెక్టర్ కల్లెపల్లి శ్రీశైలం, కేసరి యూత్ అధ్యక్షుడు రేగు బాలనర్సయ్య, ప్రింట్, ఎలక్ట్రాన్ మీడియా విలేకరులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల మోస్తరు వర్షం

మోత్కూరు/ అడ్డగూడూరు/ వలిగొండ, అక్టోబరు 2: మోత్కూరు, అడ్డగూడూరు, వలిగొండ మండలాల్లో బుధవారం ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. పత్తి వరి పంటలు నెలకు వరిగాయి. పత్తి పంట తీసేందుకు సిద్ధంగా ఉన్న పత్తి వర్షంతో తడిసిపోయిందని పత్తి, వరి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంగిలి పువ్వు బతుకమ్మ పండగ కావడంతో మండల వ్యాప్తంగా మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

శ్రీచక్ర ఆలయ ఆవిష్కరణకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మహాపీఠం నిర్వాహకులు

భువనగిరి రూరల్, అక్టోబరు 2: భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లి రమణేశ్వరం పుణ్యక్షేత్రంలో ఈనెల 13వ తేదీన శ్రీ చక్ర ఆలయ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి నిర్వాహకులు ఆహ్వాన పత్రికను అందజేశారు. బుధవారం భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డిని కలిశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సిద్దగురువు రమణానంద మహర్షి ఆధ్వర్యంలో రమణేశ్వరంలో రెండు వేల శివలింగాలు కొలువై ఉన్నాయని 1008 శ్రీచక్రాల ప్రతిష్ట శ్రీకార మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీహెచ్‌సీ సూపరింటెండెంట్ అలివేలు తొలగింపు

చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 2: చౌటుప్పల్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ కె.అలివేలు(సీఎస్ఎస్)ను తొలగిస్తూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పలు ఆరోపణలకు సంబంధించి ప్రాథమిక విచారణ జరిపి, ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. డిప్యూటీ సీఎస్ఎస్ కె.రాజగోపాల్‌ను ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు రాజగోపాల్‌ను ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తారు. ఈ మేరకు కమిషనర్ అజయ్‌కుమార్ రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేశారు.

పనులు నాణ్యతగా చేయాలి



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్ పర్సన్ కవిత

మోత్కూరు, అక్టోబరు 2: సీసీ రోడ్డు పనులు నాణ్యతగా, త్వరగా పూర్తి చేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. మునిసిపల్ వైస్‌చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, కమిషనర్ సి.శ్రీకాంత్, కౌన్సిలర్లు దబ్బెటి విజయరమేష్, పురుగుల వెంకన్న, నాయకులు వేణు, మజీద్, మన్నె మల్లయ్య పాల్గొన్నారు.

'స్టోన్ క్రషర్లపై కేసు నమోదు చేయాలి'

బొమ్మలరామారం, అక్టోబరు 2: పరిమితికి మించి జిలెటిన్ స్టిక్స్ వాడుతూ హై బ్లాస్టింగ్ చేస్తున్న స్టోన్ క్రషర్ల మీద కేసులు నమోదు చేయాలని ప్రజా పోరాట సమితి సభ్యులు బుధవారం ఎస్ఐ శ్రీశైలానికి ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సీస శ్రీనివాస్, మైలారం జంగయ్య మాట్లాడుతూ క్వారీల్లో వాడే పేలుడు పదార్థాలను లెక్కకు మించి వాడుతున్నందున వారి మీద పరిశీలన చేసి కేసులు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వట్టిపల్లి సుదర్శన్, సహాయ కార్యదర్శి మైలారం సుదర్శన్, బాలరాజు తదితరులు ఉన్నారు.

బెల్ట్ షాపుల్లో మద్యం స్వాధీనం

రాజాపేట, అక్టోబరు 2: రాజాపేట మండలంలోని సోమారం గ్రామంలో బెల్ట్ షాపులపై బుధవారం సాయంత్రం రాజాపేట పోలీసులు దాడులు నిర్వహించి ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. 25లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్టుషాపుల్లో మద్య విక్రయిస్తే సహించేది లేదన్నారు.

ఎన్నికల హామీల అమలుకు ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అశోక్‌రెడ్డి

రామన్నపేట, అక్టోబరు 2: రాష్ట్ర ప్రభుత్వం ఎనినకలకు ముందు ఇచ్చిన హామీల అమలు కోసం గ్రామీణ ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేక అశోక్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని దుబ్బాక గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలన్నింటినీ వెంటనే అమలు చేయాలన్నారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యకరమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, మామిడి వెంకట్‌రెడ్డి, గొరిగె సోములు, మేడి గణేస్, గుండాల భిక్షం, గుండాల సురేందర్, దేవులపల్లి భిక్షంరెడ్డి, నరసింహ, గుండాల నరేష్, గట్టు మహేష్, ఉదయ్‌కుమార్, శ్రీశైలం పాల్గొన్నారు.

నేడు అఖిలపక్షాల రౌండ్ టేబుల్ సమావేశం

రామన్నపేట- కొమ్మాయిగూడెం రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేయనున్న ఆదాని అంబుజా సిమెంట్ కాలుష్య పరిశ్రమను వ్యతిరేకిస్తూ ఈనెల 3వ తేదీన రామన్నపేటలో జరిగే అఖిల పక్షం పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జెల్లెల పెంటయ్య కోరారు. బుధవారం మండలంలోని వెల్లంకి గ్రామంలో కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. కాలుష్య పరిశ్రమలకు వ్యతిరేకంగా రాజకీయాలకతీతంగా అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, బోయిన ఆనంద్, వనం ఉపేందర్, సోములు, నాగేష్, సంతోష్, మహేష్ ఉన్నారు.

బతుకమ్మ అంటే పూలను పూజించడమే



చెన్నై నగరంలో బతుకమ్మ ఉత్సవాల వేదికపై పాల్గొన్న ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, అక్టోబరు 2: నిత్యం కష్టం చేసే రైతులు, కూలీలు పూలను పూజించే పండుగ బతుకమ్మ పండుగ అని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. చెన్నైలోని శ్రీకన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల మైదానంలో బుధవారం జరిగిన బతుకమ్మ సంబరాల్లో ఆయన మాట్లాడారు. పూలను పూజించడమంటే ప్రకృతిని ఆరాధించడమేనన్నారు. చెన్నైలో తుంగతుర్తి నియోజక వర్గానికి చెందిన కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. వారు గత 11 ఏళ్లుగా అక్కడ బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నారు. వారి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే సామేల్ వెళ్లి అక్కడి బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో చెన్నై తెలంగాణ సంఘం అధ్యక్షుడు ఎం.పరశురాములు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బుంగపట్ల యాకయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, సుంకరి జనార్ధన్, సిహెచ్.శ్రీనివాస్, గిరి, షఫీ ఉన్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ..



భూదాన్‌పోచంపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్: మోత్కూరు మునిసిపల్ కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఎంగిలిపువ్వు బతుకమ్మను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు రకరకాల పూలతో ఆకర్షణీయంగా, ఎత్తైన బతుకమ్మలు పేర్చి సాయంత్రం తీసుకెళ్లి కూడలి స్థలాల్లో పెట్టి ఆడిపాడారు. మోత్కూరు మండల కేంద్రంలో మునిసిపాలిటీ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మార్కెట్ యార్డుల్లో మహిళలు బతుకమ్మ ఆడటానికి లైట్లు అమర్చి, ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలువురు పితృదేవతలకు బియ్యం ఇచ్చారు. కాగా మహిళలు సాయంత్రం బతుకమ్మలు తీసుకెళ్లి ఆడే సమయానికి మోత్కూరు మండలంలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం (ఒక్కో గ్రామంలో ఒక రకంగా) కురిసింది. దీంతో మహిళల ఉత్సాహంపై నీళ్లు చల్లినట్టయ్యింది. వర్షం తగ్గాక మహిళలు బతుకమ్మలు తీసుకెళ్లి ఒక చోట పెట్టి ఆడినప్పటికీ కొంత ఇబ్బంది పడ్డారు. దీనికి తోడు మోత్కూరులో కొద్ది సేపు వి ద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగడంతో మరింత ఇబ్బంది పడ్డారు.

- ఆలేరులోని శివాలయం, రంగనాయక గుడి, సంతోషమాత ఆలయం, దుర్గామాత ఆలయాల వద్ద, స్థానిక పెద్దవాగు వద్ద మహిళలు ఎంగిలి పూల బతుకమ్మను ఆడారు.
- సంస్థాన్ నారాయణపురం, రాజాపేట, అడ్డగూడూరు, ఆత్మకూరు(ఎం), వలిగొండ, రామన్నపేట, భూదాన్‌పోచంపల్లి, తుర్కపల్లి, చౌటుప్పల్ మండలాల్లో బసుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు.



మోత్కూరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు



చౌటుప్పల్‌లో బతుకమ్మ ఆడుతున్న మునిసిపల్ చైర్మన్ రాజు



వలిగొండలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



అడ్డగూడూరులో వర్షంలో తడుస్తూనే బతుకమ్మలతో వెళుతున్న యువతులు